- కేసీఆర్‌తో జిల్లా నేతలు

లోక్‌సభ ఎన్నికల సన్నద్ధానికి ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్యక్షతన కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేసీఆర్‌ను కలిసిన జిల్లా నాయకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, తదితరులు

# గుట్టుగా ఇసుక దందా

మానేరు నుంచి జోరుగా తవ్వకాలు

- కాల్వశ్రీరాంపూర్, పెద్దరాత్‌పల్లిలో భారీగా డంపులు
- అర్ధరాత్రి వేళ హైదరాబాద్ రవాణా
- మండిపడుతున్న ప్రజలు

కాల్వశ్రీరాంపూర్: పెద్దరాత్‌పల్లిలో ట్రాక్టర్‌తో డంప్ చేస్తున్న ఇసుక

కాల్వశ్రీరాంపూర్‌లో అక్రమ ఇసుక డంపులు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3 : కాల్వశ్రీరాంపూర్ మండలంలో ఇసుక దందా జోరుగా సాగుతున్నది. మీర్జంపేట్, కిష్టంపేట్, మొట్లపల్లి, పెద్దరాత్‌పల్లి గ్రామాలను తాకుతూ వెళ్లే మానేరువాగు నుంచి అక్రమ రవాణాకు అడ్డులేకుండా పోతున్నది. రాత్రి వేళ గుట్టు చప్పుడు కాకుండా తవ్వి ట్రాక్టర్లలో తీసుకొస్తూ.. రహస్య ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్ పాండవుల గుట్ట సమీపంలో డంప్‌యార్డు, పెద్దరాత్‌పల్లిలో ఓ గుట్ట వద్ద భారీగా డంప్‌లు చేస్తూ.. అర్ధరాత్రి వేళ హైదరాబాద్‌కు లారీల్లో తరలిస్తున్నారు. ఈ క్రమంలో రోడ్లన్నీ దెబ్బతింటుండగా, ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహిస్తున్నారు. ఇసుక వాహనాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ జాహెద్ పాషాను సంప్రదించగా, ఇసుక రవాణా, డంపుల విషయం తన దృష్టికి రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు.

# ఏం చేద్దాం..!

డైలామాలో కార్పొరేటర్లు

- కార్పొరేటర్ల చేరికలు నేటికి వాయిదా
- కొంతమంది చేరికలపై ఎమ్మెల్యే విముఖత
- రామగుండం బల్దియా పాలక వర్గంలో గందరగోళం

కోల్‌సిటీ, మార్చి 3 : కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వేర్వేరుగా హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లిన రామగుండం బీఆర్ఎస్ కార్పొరేటర్లు చివరి నిమిషంలో డైలమాలో పడినట్లు తెలిసింది. ఆదివారం నాటి చేరికల కార్యక్రమం మరుసటి రోజు వరకు వాయిదా పడింది. కాంగ్రెస్‌లో కొత్తగా వచ్చిన నిబంధనలను అనుసరించి పార్టీలోకి తీసుకోవాల్సి ఉంటుందని, ఆ పార్టీ ఇన్‌చార్జి పరిశీలిస్తారని చెప్పడంతో ఈ చేరికలను సోమవారానికి వాయిదా వేసినట్లు తెలిసింది. కాగా, రామగుండం మేయర్ అనిల్‌కుమార్‌తో సహా మరో 16 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువాలు కప్పుకుందామని వేర్వేరుగా ఆదివారం ఉదయం తమ సొంత వాహనాల్లో రాజధానికి బయలుదేరి వెళ్లారు. నిజానికి ఉదయమే కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉంటాయని భావించినప్పటికీ అక్కడికి వెళ్లిన వారిలో కొంతమంది గత ఎన్నికల ముందు స్థానిక ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వ్యతిరేకంగా పనిచేసిన వారు ఉండడంతో ఆయన విముఖత చూపినట్లు తెలిసింది. దీనితో ఒకరిద్దరు కార్పొరేటర్లను పార్టీలోకి చేర్చుకోమని అక్కడే కరాఖండిగా చెప్పినట్లు తెలిసింది. దీంతో మిగతా కార్పొరేటర్లను స్థానికంగా ఉన్న ఒక హోటల్‌కు తరలించగా, వారంతా మళ్లీ సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ అధిష్ఠానం లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి స్థానం నుంచి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేరును ఖరారు చేసినట్లు తెలిసి అక్కడ ఉన్న కార్పొరేటర్లు మళ్లీ ఆలోచనలో పడినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు వెళ్లిన మేయర్‌తో సహా 17మంది కార్పొరేటర్లు గతంలో ప్రస్తుత ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా పని చేసిన వారే కావడం, తీరా ఇప్పుడు పార్టీలో చేరిన తర్వాత మున్ముందు తమకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో పరిస్థితి ఏమిటని చర్చించుకున్నట్లు తెలిసింది. పాలకవర్గం పదవీ కాలం ముగియడానికి ఇంకా 10 నెలలే కాల వ్యవధి ఉండగా, తన పదవి కాపాడుకునే ఉద్దేశంతో మేయర్ అనిల్‌కుమార్ కార్పొరేటర్లను ప్రభావితం చేశాడని, ఆ పార్టీలో చేరడం వల్ల తమకేంటి ప్రయోజనం అన్నట్టుగా ఇప్పుడు ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనా సోమవారం ఉదయం ఈ చేరికల సస్పెన్స్‌కు తెరపడనుంది.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సుల్తానాబాద్‌రూరల్, మార్చి 3: భూపతిపూర్ గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారి కోసం సీసీరోడ్డు నిర్మాణానికి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు శంకుస్థాపన చేశారు. రూ.10లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ప్రత్యేకాధికారి అశోక్, మాజీ సర్పంచ్ కవ్వంపల్లి జమున-తిరుపతి, నాయకులు తదితరులు ఉన్నారు.

## ఆదివరాహ స్వామిని దర్శించుకున్న అడిషనల్ కలెక్టర్

కమాన్‌పూర్, మార్చి 3: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆదివరాహస్వామి ఆలయంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు అడిషనల్ కలెక్టర్ దంపతులకు శాలువా కప్పి సన్మానించారు. ఆయన వెంట తహసీల్దార్ అరీఫుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్, సూదాటి కోటేశ్వర్‌రావు, ఆర్ఐ సముదాని ఉన్నారు.

## ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

ధర్మారం, మార్చి 3 : ఇటీవల తెలంగాణ గురుకుల లెక్చరర్ ఉద్యోగాలు సాధించిన వారిని ఆదివారం ధర్మారం మండల కేంద్రంలో సాందీపని పాఠశాలలో ఆదివారం తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. ఫోరం మండలాధ్యక్షుడు కేవీఆర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించి లెక్చరర్లు, పీజీటీలుగా ఎంపికైన సుచిత్ర, మహిపాల్, మహేశ్, భవాని సింగ్‌ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు ఆవుల రాజేశ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ మూర్తి మండల జనరల్ సెక్రటరీ కోల శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ రామారావు, ఫోరం సభ్యులు రాజేందర్, రాజశేఖర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అమ్మితే కఠిన చర్యలు

పెద్దపల్లి టౌన్, మార్చి 3: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న పీడీఎస్ బియ్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడలో పీడీఎస్ బియ్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా ఇంట్లో నిల్వ చేసిన 37 బ్యాగులు, 18 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమైందన్నారు. ఇక్కడ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కల్వల మహేందర్, చంద్రశేఖర్, సునిల్, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్వోసీ అందజేత

ఎలిగేడు, మార్చి 3: మండలంలోని ముప్పిరితోట గ్రామానికి చెందిన నారగోని రజిత అనారోగ్య కారణంగా హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పెద్దపల్లిలో సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.10 లక్షల ఎల్వోసీని ఆమె కుటుంబ సభ్యులకు అందించారు. ఇక్కడ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలున్నారు.

దుమ్ముతో వాలిన పంటను చూపుతున్న రైతు సమ్మయ్య

# దుమ్ముతో పంటలు నాశనం

- నీళ్లు చల్లించాలని రైతుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహించి లారీలను అడ్డుకున్న రైతులు
- పంటను పరిశీలించిన టీఎస్ఎండీసీ పీవో

ముత్తారం, మార్చి 3: మండలంలోని ఓడేడ్, ముత్తారం, ఖమ్మంపల్లి, జిల్లేలపల్లి, అడవిశ్రీరాంపూర్‌లో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఇసుక రీచ్‌ల వల్ల మండలంలోని రైతుల పంటలు దుమ్ముధూళితో నిండిపోతున్నాయి. గత గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు మండలం కేంద్రంలోని మంథని, ఓడేడ్ మెయిన్‌రోడ్‌పై ఇసుక లారీలను అడ్డుకున్నారు. రెండు నెలలుగా రోడ్డుపై నీళ్లు చల్లడం లేదని పంటలు పూతకాత దశలో దుమ్ముతో చేతికి వస్తలేవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంటలపై మండుల ప్రభావం లేక మొక్కలు రోగాల బారిన పడుతున్నాయన్నారు. దుమ్ముతో పంట ఎదుగుదల లోపించిందని, వచ్చినపూత ఎండిపోతున్నదని తెలిపారు. రోడ్డుపై గుంతలు పడడంతో రీచ్ నిర్వాహకులు ఎర్రమట్టి పోయడంతో దుమ్ము అధిక మొత్తంలో వస్తుందన్నారు. నీళ్లు చల్లించాలని రీచ్ నిర్వాహకులను అడిగితే మా బాధ్యత కాదని టీఎస్ఎండీసీ అధికారులదే బాధ్యతని చెప్పారని తెలిపారు. దుమ్ము భయంతో కూలీలు పనికి వస్తలేరని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడి తమ సమస్యను టీఎస్ఎండీసీ అధికారులతో మాట్లాడించారు. రైతుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తామని అప్పటి వరకు ఇసుకను లారీల్లోకి లోడ్ చేయమని హామీ ఇవ్వడంతో లారీలను వదిలారు. గత శనివారం పెద్దపల్లి టీఎస్ఎండీసీ పీవో రాంప్రసాద్ వచ్చి దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. రోడ్డుపై దుమ్ము రాకుండా వాటర్ ట్యాంకర్లతో నీళ్లను చల్లించాలని రీచ్ నిర్వాహకులకు సూచించారు. తమకు న్యాయం చేయాలని పీవో రాంప్రసాద్‌కు నష్టపోయిన రైతులు వినతిపత్రం అందించారు. ఇక్కడి పరిస్థితిపై అధికారులకు తెలుపుతానని హామీ ఇచ్చారు. తమ సమస్యను త్వరగా పరిష్కరించాలని లేదంటే ఏ పోరాటానికైనా సిద్ధమేనని హెచ్చరించారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

### నష్టపరిహారం అందించాలి

ఎకరం ఇరవై గుంటల్లో మిర్చి వేసిన. ఇసుక రీచ్ లారీల వల్ల పూతలో దుమ్ము నిండడంతో మొత్తం ఎండిపోయి క్రాప్‌కు రావడం లేదు. మిరుపచేను మొత్తం ఎర్రదుమ్ముతో నిండింది. అధికారులు, రీచ్ నిర్వాహకులు రోడ్డుపై నీళ్లు చల్లిస్తే మా రైతులకు ఇంత ఇబ్బందులు ఉండేవికాదు. నాకు బాగా నష్టం వచ్చింది. నా పంటకు నష్టపరిహారం అందించాలి. రైతులు బాగుండాలంటే దుమ్ముధూళి రాకుండా చూడాలి. లేదంటే మా భూములు కౌలుకు తీసుకోవాలి.

-ఎనగందుల సమ్మయ్య

### టమాట పంట దుమ్ముమయం

ముత్తారం మండల కేంద్రంలోని రోడ్డును ఆనుకొని నాకు రెండెకరాల భూమి ఉంది. 30గుంటల్లో టమాట వేసిన. ఓడేడ్, ముత్తారం ఇసుక రీచ్‌కు లారీలు రావడంతో దుమ్ము వస్తుంది. క్రాప్‌కు వచ్చిన టమాట తోట మొత్తం దుమ్ముమయమైంది. దుమ్ముతో టమాటలు కుళ్లుపోతున్నాయి. నీళ్లు చల్లించాలని అధికారులను వేడుకున్నా పట్టించుకుంటలేరు. ఇప్పటికైనా అధికారులు మా రైతుల బాధ అర్థం చేసుకోవాలని కోరుతున్న.

-నూనేటి కృష్ణ

### ఉన్నతాధికారులకు విన్నవిస్తా

ముత్తారం మండల కేంద్రంలో ఓడేడ్, ముత్తారంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లో లారీల నడవడంతో వస్తున్న దుమ్ముతో రైతుల ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. రోడ్డుపై ఎర్రదుమ్ము ఉండడం వల్ల ఇబ్బంది అవుతున్నది. ఈ రోడ్డుపై అదనపు వాహనాలు పెట్టి నీళ్లు చల్లిస్తాం. రైతులు నష్ట పోకుండా చూస్తాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు విన్నవిస్తా

-టీఎస్ఎండీసీ పీవో రాంప్రసాద్

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలం రాగినేడులో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్ శ్రవణ్‌కుమార్

ముత్తారం : మానేరు వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

# పల్స్‌పోలియో విజయవంతం

**జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. హెల్త్‌సెంటర్లు, ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఐదేండ్లలోపు చిన్నారులకు సిబ్బంది పోలియో చుక్కలు వేశారు.**

పెద్దపల్లి రూరల్, మార్చి 3: పెద్దపల్లి మండలంలోని రాగినేడు, రాఘవాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పల్స్‌పోలియో విజయవంతం అయింది. రాఘవాపూర్‌లో డాక్టర్ మమత ఆధ్వర్యంలో 4,175 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ కృపాబాయి, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు ఉన్నారు.

కోల్‌సిటీ, మార్చి 3 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం పోలియో చుక్కల పంపిణీని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఇక్కడ కార్పొరేటర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి ఉన్నారు.

సుల్తానాబాద్‌రూరల్, మార్చి 3: గర్రెపల్లి సబ్ సెంటర్‌లో ఆదివారం పిల్లలకు పల్స్ పోలియో చుక్కలను ఎంపీపీ పొన్నమనేని బాలాజీరావు వేశారు. ఇక్కడ ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఆఫీసర్ అనుదీప్, ఎంపీటీసీ అనూష, కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇక్కడ ఎంపీపీ నూనేటి సంపత్, జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, డాక్టర్ మహేందర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

కమాన్‌పూర్, మార్చి 3: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు గ్రామాల్లోని సబ్ సెంటర్లు, పంచాయతీ ల్లో పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. మండల వైద్యాధికారి అశోక్‌కుమార్ ఉన్నారు.

రామగిరి, మార్చి 3 : మండల కేంద్రంలో బుధవారంపేట, సెంటినరీకాలనీ, పన్నూరు గ్రామాల్లో పల్స్‌పోలియోను ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొంరయ్య, వైస్ ఎంపీపీ శ్రీదేవి భాస్కర్, జడ్పీటీసీ శారద పాల్గొని ప్రారంభించారు. ఇక్కడ డాక్టర్ ప్రదీప్, మాజీ సర్పంచ్ రజిత, అల్లం పద్మ, గంట పద్మ ఉన్నారు.

జూలపల్లి, మార్చి 3 : మండల కేంద్రంలో ని పంచాయతీలో ఎంపీపీ రమాదేవి, అబ్బాపూర్‌లో

ఫర్టిలైజర్‌సిటీ : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు వెంకటేశం చిన్నారులకు చుక్కల మందు వేశారు. తొలిరోజు 2,145 మందికి చుక్కలు వేసినట్లు వైద్యాధికారి సంపత్‌రెడ్డి వెల్లడించారు.

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 3: ఐదేండ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ ఏరియాలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ డిప్యూటీ డీఎంహెచ్‌వో కృపాబాయి, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ త్రియంభకేశ్వర్‌రావు, సిబ్బంది ఉన్నారు.

జ్యోతినగర్(రామగుండం), మార్చి 3: రామగుండంలోని 20వ డివిజన్‌లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ పర్యవేక్షించి చిన్నారికి పోలియో చుక్కలు వేశారు. ఇక్కడ ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు జీ శ్రీదేవి, ఎం నీల ఉన్నారు.

ఎలిగేడు, మార్చి 3: పల్స్‌పోలియో చుక్కల మందును ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు తప్పకుండా వేయించాలని మండల వైద్యాధికారి నిస్సీ క్రిస్టినా సూచించారు. ఇక్కడ హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరీదేవి, వైద్యసిబ్బంది ఉన్నారు.

మంథని/మంథని రూరల్, మార్చి 3: మంథని పట్టణంతో పాటు మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా తొలి రోజు 34 కేంద్రాల్లో 0-5 సంవత్సరాలున్న 3800 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఇక్కడ ఎంపీపీ కొండ శంకర్‌తోపాటు పలువురు ప్ర జాప్రతినిధులు, అధికారులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

ముత్తారం, మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మించడం మనందరి బాధ్యతని మండలంలోని ఓడేడ్ ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతుపెద్ది కిశన్ రెడ్డి అన్నారు. గ్రామంలో పల్స్ పోలీయో కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అడవి శ్రీరాంపూర్‌లో ఎంపీటీసీ గీతారాణి బాలాజీ, లక్కారంలో ఎంపీటీసీ తిరుమల తిరుపతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో మొత్తం 1913 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసినట్టు ప్రభుత్వ వైద్యుడు అమరేందర్ రావు తదితరులు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్ : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ మహేందర్

జూలపల్లి : మండల కేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ రమాదేవి

- అలరించిన చిరుతల రామాయణం

ముత్తారం మండలం లక్కారం గ్రామంలో నిర్వహిస్తున్న చిరుతల రామాయణం ప్రదర్శన అలరించింది. ఆదివారం మూడోరోజు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, సుందరకాండను ప్రదర్శించారు. కన్నుల పండువగా జరిగిన కార్యక్రమానికి ప్రజలు వందలాదిగా తరలివచ్చి తిలకించారు.

-ముత్తారం, మార్చి 3

## చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

సురేశ్ (ఫైల్)

జ్యోతినగర్, మార్చి 3: ఎన్టీపీసీ మల్కాపూర్‌కు చెందిన పిట్టల సురేశ్ (30) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. ఎన్టీపీసీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మల్కాపూర్ శివారులోని ఎన్టీపీసీ కాలువకు పిట్టల సురేశ్ శనివారం చేపల వేటకు వెళ్లాడు. ఈ సమయంలో మూర్ఛ వ్యాధి రావడంతో ప్రమాదశాత్తు కాలువలో పడిపోయి. మృతి చెందాడు. ఆదివారం స్థానికులకు మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సురేశ్ తల్లి పిట్టల బాయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎన్టీపీసీ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ ఖాన్ కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గురువులతో పూర్వ విద్యార్థులు

ధర్మారం, మార్చి 3 : ధర్మారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఇక్కడ పూర్వపు హెడ్మాస్టర్ వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు శ్రీధర్‌రావు, రాజమల్లయ్య, అజ్గర్ అలీ, ఆనందం, విజయ్ కుమార్, విజయ రావు, తిరుపతి, రవీందర్, పోచయ్య, పీఈటీ క్రిష్ణవేణి, విద్యావలంటీర్లు కొడిచర్ల రాజు, బాస నర్సింగరావు ఉన్నారు.

## క్షేత్ర సందర్శన

పెద్దాపూర్‌లో పరిశీలిస్తున్న లండన్ ప్రతినిధి నటాలియా

జూలపల్లి, మార్చి 3 : పెద్దాపూర్, తేలుకుంట గ్రామాల్లో ఆదివారం బీసీఐ ఆధ్వర్యంలో నేల కోతల ప్రదేశాలు, చెరువుల పరివాహక ప్రాంతాలను లండన్ ప్రతినిధి నటాలియా సందర్శించారు. ఆ ప్రాంతాల్లో నాటిన మామిడి, జామ, సీతాఫలం, దానిమ్మ మొక్కలను పరిశీలించారు. రైతులు మామిడి తోటల్లో అంతర పంటగా పత్తి పంట సాగు చేసుకోవచ్చని సూచించారు. చెరువు, కుంటల శిఖం భూముల్లో పండ్ల మొక్కలు పెంచితే నేల కోతకు గురికాకుండా ఉంటుందని వివరించారు. ఇక్కడ సంస్థ ప్రతినిధి పీయూస్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సతీశ్, శ్రీలీలా సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న సతీశ్

అవార్డు అందుకుంటున్న ఇనుముల సతీశ్

మంథని, మార్చి 3: మంథనికి చెందిన ఇనుముల సతీశ్ జాతీయ సేవారత్న అవార్డును హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం అందుకున్నారు. జాతీయ సేవారత్న నేషనల్ అవార్డు-2024 సంవత్సర్సానికి మంథనికి చెందిన సంఘ సేవకులు, మాజీ జర్నలిస్టు, లాయర్, దివ్యాంగుల హక్కుల సంఘం నాయకులు, మాజీ ప్రజాప్రతినిధి ఇనుముల సతీశ్‌ను ఎంపిక చేయగా అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, పెద్దపల్లి మాజీ ఎంపీ చెలిమల సుగుణకుమారి, సింగరేణి జీఎం లలిత్‌ల చేతుల మీదుగా సతీశ్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మంథని కాంగ్రెస్ నాయకులు ఉప్పట్ల శ్రీనివాస్, ఎలిశెట్టి అనీత, రాము, శ్రీపతి బానయ్య, కుర్ర లింగయ్య, మాజీ సైనికుడు సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

## నంది మేడారం శ్రీ అమరేశ్వరాలయం నూతన కమిటీ ఎన్నిక

ఎన్నికైన అమరేశ్వరాలయ కమిటీ సభ్యులు

ధర్మారం, మార్చి 3: ధర్మారం మండలం నంది మేడారంలోని శ్రీ అమరేశ్వరాలయ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులుగా కట్ట సరోజ స్వామి, మిట్ట తిరుపతి, కట్ట రమేశ్, చిన్న లచ్చయ్య, సింగిరి రవి కుమార్, ముఖ్య సలహాదారుడిగా రాసూరి మల్లారెడ్డి, అధ్యక్షుడిగా చిప్ప మణిశర్మ, ఉపాధ్యక్షులుగా మానుపాటి బాలు, శాకాపురం కమలేశ్, ప్రధాన కార్యదర్శిగా తమ్మనవేని మహేశ్, కార్యదర్శులుగా కందుకూరి రాముకుమార్, బొంతల నర్సింగం, బొడ్డు రవి, కాంపెల్లి రాజు, కోశాధికారిగా పంజాల శ్రీనివాస్ మరో 17 సభ్యులుగా ఎన్నికయ్యారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కాల్వశ్రీరాంపూర్: ఆర్థిక సాయం అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: మండలంలోని మీర్జంపేట గ్రామానికి చెందిన నిమ్మ రవి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి డాక్టర్ పచ్చిక శ్రీకాంత్‌రెడ్డి-స్రవంతి దంపతులు ఆదివారం రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబాన్ని ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని గ్రామస్తులు కోరారు. ఇక్కడ పచ్చిక సదాశివరెడ్డి-సుగుణ, రామిడి తిరుపతిరెడ్డి, పోశాల సదానందం, ఉయ్యాల పోచాలు, శ్రీనివాస్, ఉయ్యాల భాస్కర్, తిప్పని సదయ్య గ్రామస్తులు ఉన్నారు.

## రేపటి నుంచి మల్లన్న ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు

ఓదెల మల్లికార్జునస్వామి ఆలయం

ఓదెల, మార్చి 3: పెద్దపల్లి జిల్లాలో ప్రధాన పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న ఓదెల మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మహా శివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఇందుకు అన్ని ఏర్పాట్లను ఆలయ పాలకవర్గం, సిబ్బంది చేశారు. 5వ తేదీన అగ్రోదకం, మహాగణపతి పూజ, గౌరీ పూజ, అఖండ దీపస్థాపన, సాయంత్రం ధ్వజారోహణ, శివయాగ మండప స్థా